క్లుప్తంగా

నేరాల నియంత్రణకు సహకరించాలి

ఎస్‌ఐ రవీందర్‌నాయక్

కొందుర్గు: నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ రవీందర్‌నాయక్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవులు ఉన్న కారణంగా కొందరు దూర ప్రాంతాలకు వెళ్తుంటారని, ఈ క్రమంలో ఇంటి వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటికి అలారం సిస్టమ్, సీసీ కెమెరాలు అమర్చుకోవాలని తెలిపారు. బయటికి వెళ్లే సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి వేళల్లో ఆరుబయట నిద్రిస్తున్న వారు ఆభరణాలు పెట్టుకోవద్దని, మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రభాకర్



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రభాకర్, కానిస్టేబుళ్లు

మొయినాబాద్‌రూరల్: వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ ప్రభాకర్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ సమీపంలో వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పెండింగ్ చలాన్‌లను చెల్లించాలని వాహనదారులకు సూచించారు. వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. వాహనాలకు ఇష్టానుసారంగా నెంబర్లు వేయించుకోవడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని, అలాంటి నెంబర్లు వేసుకుంటే చలాన్‌లు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎఎస్‌ఐ అంజయ్య, కానిస్టేబుల్ రాజేశ్, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు కేసీఆర్‌కు లేదు

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో పదేళ్ల పాటు పాలన చేసిన కేసీఆర్ కమిషన్‌లకే పనిచేశారని, వరంగల్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్ అన్నారు. సోమవారం ఆయన హిమాయత్‌నగర్‌లో మాట్లాడుతూ.. వరంగల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంగ్రెస్‌పై చేసిన విమర్శలు సరికాదన్నారు. పదేళ్లలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రానికి ఏమి చేశారో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదంటూ మాట్లాడడం సరికాదన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మానుకోని అభివృద్ధికి సహకరిస్తే మంచిదని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం బీఆర్‌ఎస్ పార్టీని ఎన్నడు క్షమించదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకే కేసీఆర్ ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఇకనైనా ఆరోపణలు చేయకుండా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడదామన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వేణుగోపాల్‌రావు

షాద్‌నగర్: ప్రతిరోజు క్రీడలను సాధన చేయడంతో మానసికోల్లాసం కలుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని ఈశ్వర్‌కాలనీలో మాజీ కౌన్సిలర్ ఈశ్వర్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో దేహదారుఢ్యం పెంపొందడంతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రీడలు క్రీడాకారుల మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని నెలకొల్పుతాయన్నారు. క్రీడల సాధనతో మేథోశక్తి పెంపొందుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి వేసవి శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంతయ్య, ఆవుల శ్రీశైలం, శ్రీనివాస్, వెంకటరమణ, మహేందర్, శేఖర్, శ్రీనివాస్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి

మండల పశువైద్యాధికారి అహ్మద్



షాబాద్: హైతాబాద్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యుడు

మొయినాబాద్: పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరులో సోమవారం గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని 239 పాడి పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాడి పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వచ్చే రోగాల నుంచి పశువులను కాపాడుకోవడానికి ముందస్తుగా నివారణ టీకాలు ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: పశువులకు సీజన్‌లో వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి సూచించారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్, ఊబ్బగుంట, మల్లారెడ్డిగూడ, అప్పారెడ్డిగూడ, దామర్లపల్లి గ్రామాల్లో వారు జీవాలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు వచ్చే నెల 13 వరకు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బల్‌రాం, అంజయ్య, మహేందర్, రాణి, శ్రీకాంత్, సాయి, శేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించాలి

శంకర్‌పల్లి: పశువుల్లో వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించాలని మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని గోపులారం గ్రామంలో ఆమె 120 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం నెలరోజుల పాటు కొనసాగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



షాబాద్: మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాబాద్: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జనరల్ సెక్రటరీ రెండు పోస్టులకు 9 మంది, నాలుగు ఉపాధ్యక్ష పదవులకు 10 మంది, 6 కార్యవర్గ సభ్యులకు 10 మంది పోటీచేశారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కమల వికాసమే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు చేశాక కాశ్మీర్‌ను మరో స్విట్జర్లాండ్‌గా భావించి పర్యాటక రంగం ఊపందుకుందన్నారు. అనేక రకాలుగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో దేశ, విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటే చూస్తూ తట్టుకోలేక పాకిస్థానీయులు ఉగ్రవాదులతో దాడులు చేయించారన్నారు. భారతీయులంతా పార్టీలకతీతంగా దేశ భద్రత, రక్షణ కోసం ఉగ్రదాడులను ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు ప్రతాప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పీసరి సతీష్‌రెడ్డి, బీజేవైఎం స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ రాము, మాజీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, కిరణ్, నాయకులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలి

షాద్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగుర వేసేందుకు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన హాజరై మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర నిధులతోనే పౌష్టికాహారం అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అనేక పథకాలలో కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య, నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, కుర్మయ్య, ప్రశాంత్, గణేష్, విష్ణు, వెంకటేశ్, నర్సింహ, శివ, శంకర్, హన్మంత్, రేద్యా, నర్సింహ, పాష, రవి, యాదయ్య, రాజు పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో పార్టీని పటిష్టం చేయాలి

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం



మాజీ ఎమ్మెల్యే, పరిశీలకులను సన్మానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పట్టణం, గ్రామాల్లో పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలని నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం సూచించారు. సోమవారం పట్టణంలోని ఓ హాల్‌లో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కమిటీల ఏర్పాటు సమావేశానికి పార్టీ పరిశీలకుడు నర్సింలుగౌడ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. మొదటగా పహల్గాం ఘటనలో మృతి చెందిన వారికి శాంతి కలగాలని కోరుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, భవిష్యత్‌లో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని భరోసానిచ్చారు. అదే విధంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీకి సంబంధించి కమిటీల నిర్మాణంపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నివేదికలు తయారుచేసి, అధిష్టానానికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాములుగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వాసుదేవ్ కన్నా, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, దయానంద్, పండిత్‌రావు, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమరులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ

కేశంపేట: మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సోమవారం రాత్రి గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేశారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పల్లె బాలీశ్వర్, లింగం, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యానారాయణ, శేఖర్, తిరుపతిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

షాబాద్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2005–06వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఎంఎస్ గార్డెన్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడిన వారందరూ ఒకరినొకరూ పరిచయం చేసుకున్నారు. మళ్లీ 19 ఏళ్ల తర్వాత అందరం ఒకచోట కలవడం సంతోషంగా ఉందని చెప్పుకొచ్చారు. చిన్ననాటి జ్ఞాపకాలు, అనుభూతులతో గుర్తుచేసుకొని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, దేవిడ్‌రెడ్డి, దశరథ, కిష్టయ్య, నర్సింలు, ఆంజనేయులు, యాదగిరాచారి, రాములును వేదిక పైకి పిలిచి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పరమేశ్, శ్రీశైలం, యాదగిరి, నవీన్‌కుమార్, నరేందర్‌రెడ్డి, మన్మత్, చెన్నయ్య, అడ్డు, కవిత, సంతోషిమాత, రాజామణి తదితరులు ఉన్నారు.



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

బీజేపీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

నందిగామ: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో పార్టీ మండల అధ్యక్షుడు వడ్ల అరవింద్ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతీ ఒక్క కార్యకర్తపై ఉందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు పెద్దఎత్తున విజయం సాధించాలని, ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, చెన్నయ్య, కృష్ణమోహన్, సత్తయ్య, నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జడ్జీలకు సన్మానం



జడ్జి ధీరజ్‌కుమార్‌కు వీడ్కోలు పలుకుతున్న న్యాయవాదులు

షాద్‌నగర్: పట్టణంలోని కోర్టులో జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ధీరజ్‌కుమార్ తొర్రూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అదే విధంగా సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన స్వాతిరెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. జూనియర్ సివిల్ జడ్జి సేవలను వారు కొనియాడారు. స్వాతిరెడ్డికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్, గుండుబావి శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, రమేశ్, లింగంగౌడ్, జయమ్మ, రహీముద్దీన్, శ్రీశైలం, విజయ్‌కుమార్‌గౌడ్, విజయభాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ మహిళా రాష్ట్ర కమిటీ సభ్యురాలు నాగమణి



షాద్‌నగర్ చౌరస్తాలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ మహిళా నేతలు

షాద్‌నగర్: మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన కేసీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నాగమణి డిమాండ్ చేశారు. వరంగల్ సభలో కేసీఆర్ మహిళలను కించపరిచే విధంగా మాట్లాడినందుకు నిరసనగా సోమవారం షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించారన్నారు. ఈ విషయాన్ని కేసీఆర్ రాజకీయం చేశారని, బస్సుల్లో మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకుంటున్నారని అగౌరవపరిచే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. కేసీఆర్ కూతురు కవిత లిక్కర్ స్కాం చేసి కోట్లాది రూపాయలు సంపాదించిందని విమర్శించారు. మహిళలు ఆధార్ కార్డుతో రాష్ట్రం మొత్తం ఉచితంగా బస్సుల్లో ప్రయాణం చేస్తుంటే కేసీఆర్ కడుపు మండుతుందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మహిళలను అగౌరపరిచి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే మహిళా లోకం బీఆర్‌ఎస్ పార్టీ నేతలకు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, వారిని గ్రామాల్లో తిరగనీయమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వజ్రమ్మ, బాలమణి, చంద్రకళ, మహముదా బేగం, స్రవంతి, శంకరమ్మ, పర్వీన్ ఫాతిమా, శోభ తదితరులు పాల్గొన్నారు.

మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మేడే వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పట్టణ కేంద్రంలో సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మే 2వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవం పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, దీన్ని ఐక్యంగా ఉండి, సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో మేడే వేడుకల్లో పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు సత్యం, మోహన్, రాములు, బుచ్చయ్య, రవి, నర్సింలు, రామచందర్, మాణయ్య, శ్రీకాంత్, కిష్టయ్య, అజీమ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై ఆరోపణలు తగవు

పార్టీ మండల అధ్యక్షుడు వీరేశ్



మాట్లాడుతున్న నాయకులు

కేశంపేట: కేసీఆర్‌కు రాజకీయ భిక్షపెట్టి, తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల ఆరోపణలు తగవని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అబద్ధాలు మాట్లాడారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అప్పుల పాలైనట్టు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు చేసిన అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే కేసీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమేశ్, అనసూయ, తైదా పర్వతాలు, భీమయ్య, తుమ్మల గోపాల్, రావుల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ విద్యలతో ఆత్మరక్షణ

కుంగ్‌ఫూ మాస్టర్ బాల్‌రాజ్

షాద్‌నగర్: యుద్ధ విద్యలు ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతాయని కుంగ్‌ఫూ మాస్టర్ బాల్‌రాజ్ అన్నారు. సోమవారం పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న సత్యనారాయణస్వామి దేవాలయం ఎదుట న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాస్టర్ బాల్‌రాజ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు యుద్ధ విద్యలు విధిగా నేర్చుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఎదుటి వారిని తమను తాము రక్షించుకునేందుకు కరాటే, కుంగ్‌ఫూ వంటి యుద్ధవిద్యలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. యుద్ధ విద్యల ద్వారా శరీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందని, అదేవిధంగా దృఢంగా తయారవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు మాస్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాస్టర్లు అహ్మద్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కుంగ్‌ఫూలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బెల్టులు అందజేస్తున్న మాస్టర్లు

రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకే సభ

- పదేళ్ల పాలనలో కేసీఆర్ చేసిన అభివృద్ధి శూన్యం
- సభలో కాంగ్రెస్‌పై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మండిపాటు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునేందుకు 14 నెలల తర్వా రజతోత్సావాల పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ విమర్శించారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత పదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఆరోపించారు. ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోని కేసీఆర్ కుటుంబ ప్రయోజనాలే లక్ష్యంగా తన పరిపాలన కొనసాగించారని విమర్శించారు.

మాట తప్పిన కేసీఆర్

కేసీఆర్ పదేళ్ల పాలనలో అనేక హామీలను ఇచ్చి మాట తప్పారన్నారు. దళిత ముఖ్యమంత్రి హామీ, దళితులకు మూడెకరాల భూమి, ప్రతి ఇంటికి ఉద్యోగం, ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత వంటి అనేక హామీలను విస్మరించారని గుర్తుచేశారు. కేసీఆర్ ఏర్పాటు చేసిన రజతోత్సవ సభ గులాబీ పార్టీ సభ కాదని, గులాముల సభ అన్నారు. సభ ద్వారా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కేసీఆర్ తన సొంత డబ్బా కొట్టుకోవడానికే సభను ఏర్పాటు చేశారని ఎద్దేవా చేశారు. దక్షిణ తెలంగాణపై కేసీఆర్ వివక్షను చూపారని, పాలమూరు ఎత్తిపోతలను 30శాతం కూడా పూర్తి చేయలేదని ఆరోపించారు. లక్ష్మిదేవిపల్లి ప్రాజెక్టును చేపడతానని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క రోజు లక్ష్మిదేవిపల్లి గురించి మాట్లాడలేదన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ఎమ్మెల్యే చేయలేని పనులను తాను ఒక్కొక్కటిగా చేస్తూ వస్తున్నానన్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం కూలిపోయే దశకు చేరుకుందని, ప్రాజెక్టు నిర్మాణంలో చేసిన అవినీతికి కేసీఆర్ చిప్పకూడు తినే రోజులు దగ్గర పడ్డాయన్నారు.

కేసీఆర్ తెలంగాణ జాతిపితనా?

కేసీఆర్‌ను తెలంగాణ జాతి పితగా భావిస్తున్న ఆయన గులాములు వాస్తవాలను తెలుసుకోవాలని సవాల్ విసిరారు. 24గంటలు ఫాంహౌస్‌లోనే గడిపే కేసీఆర్ తెలంగాణ సమాజానికి ఏ విధంగా జాతిపిత అవుతారని ప్రశ్నించారు. కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, నాయకులు కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, ఎండీ. ఇబ్రహీం, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.